# హనుమాయమ్మ డైరీలు

మనం బ్రతికుండగా మన రచనలపట్ల జనం ఇంకా మోజు కలిగివుంటే దానిని 'గ్లామర్' అనొచ్చు. మనం చనిపోయాకకూడా మన రచనల పట్ల ఇంకా జనం భక్తి శ్రద్ధల్ను కనబరిస్తే దాన్ని కీర్తి కింద జమకట్టవచ్చు. క్రిటిక్స్ అని పేరెట్టుకున్నవాళ్ళు అప్పుడప్పుడు తిరగబడి మన "గ్లామర్" మీద దెబ్బతీస్తూ వుంటారు. వీరే మనం చనిపోయిం తర్వాత మన డైరీలనూ మన ఉత్తరాలనూ కెలికి మనకులేని గొప్పతనాన్ని అంటకట్టి మనల్ని కీర్తిశేషుల్ని చేస్తారు. క్రిటిక్స్ అగస్త్య భ్రాతలూ హనుమాయ్మ మొగుళ్లూనూ, వాళ్ళు మనమీదపడి బ్రతుకుతూంటారు. పొలిటీషియన్స్‌లో కింగ్ మేకర్స్ అని వుంటారు. ఈ క్రిటిక్స్ ఆ బాపతు సరుకే. తెలుగులో మన అదృష్టవశాత్తూ మంచి క్రిటిక్స్ లేరు. ఉన్న వారిలో చాలా మందికి మోడ్రన్ రైటింగుపట్ల సానుభూతిలేదు. క్రిటిక్స్ అనే బాపతు జనం వుంటే వాళ్ళు ఓల్డుకాసిక్స్ మీదపడి బ్రతుకుతూంటారు. ఇహపోతే ఇంగ్లీషు చదువుకున్నవారు పాశ్చాత్య సాహిత్యం మోజులో మనల్ని గుర్తించనే గుర్తించరు. తెలుగు రైటింగ్‌ని ఎవరూ ఆట్టే పట్టించుకోరు. ఇప్పుడు ఇనోన్నటి నావెల్సు కథలూ గిలుకుతున్నారు కదా మన ఆడ రైటర్స్ - తృణమో ఫణమో ముడుతూనే వుంది. కాని క్రిటిక్స్ ఎవరూ మన రాతల్ని గురించి పన్నెత్తి మాట్లాడ్డంలేదు. మనకున్న గ్లామర్‌ని చూసి ఉడుకు మోత్తనం చేత వాళ్ళలా చీమకుట్టినట్లయినా ఫీలవకుండా వుండటం నిజానికి ఏమీ బాగోలేదు.

అడవాళ్ళ రచనలను విమర్శించడానికి ఆడ క్రిటిక్స్‌ని మనవే తయారు చేసుకోవాలి కాని ప్రతి స్వల్ప విషయానికి మగవారి మీద ఆధారపడ్డం ఏమీ బాగోలేదు. కిట్టనివారు మన కీర్తికి మనవే డబ్బా వాయించుగోటం బావుండదేమో అంటారుగాని ఎవరి పెళ్ళికి వారే బాజాలు ఏర్పాటు చేసుగున్నట్లు, ఎవరి కీర్తికి వారు డప్పు కొట్టుకుంటే వచ్చిన నష్టమేమిటి నాకు తెలీకడుగుతాను,

మగవారు చచ్చిపోతే వారు కీర్తిశేషు లవుతారుకదా! మనం కీర్తి శేషమ్మ లవాలి కాని కీర్తిశేషయ్యలు మాత్రం కాకూడదు.

హనుమాయమ్మ అని ఒక రచయిత్రి వుందనుకోండి. ఆవిడ వాడిన కుంపటి, చేట, గరిట, పాత రవికలూ, కాఫీ ఫిల్టరూ మనం యిప్పట్నుంచీ జాగ్రత్త చేయాలి. అసలు ప్రతి రచయిత్రీ డైరీలు, నోట్సులు, ఉత్తరాలు విరివిగా రాస్తూ వుండాలి. కాంట్రవర్సీస్‌లో పడుతూ లేస్తూవుండాలి.

ఎప్పుడేనా మ్యూజియం కాని ఆర్ట్ ఎగ్జిబిషన్స్ కాని జరిగితే అందులో ప్రఖ్యాత రచయిత్రులు వాడిన పనిముట్లను (గరిట, అట్లకాడ, చేట, మొరుం జల్లెడ, కుంపటి. చాప, కత్తిపీట. మరచెంబు, గ్లాసు, తిన్న కంచం, వాడిన స్టీలు సామాను ఎట్సెట్రాస్) వేలాం వేసికాని ప్రదర్శించాలి. ఆవిడ కట్టుకున్న చీరల్నికూడా ఒకటో రెండో జాగ్రత్త చేస్తే మంచిది. వాటికి మంచి హైప్రైస్ వస్తుంది. ఇప్పట్నుంచీ మన రైటరీమణులు యీ విషయంపట్ల శ్రద్ధవహిస్తే ముందు తరాలవారికి పరిశోధనలో చికాకు లుండవు.

మగవాళ్ళయితే వారు పుట్టిన ఇంటినీ ఆ పరిసరాలను పరిశోధకులు శ్రద్ధతో గమనించి ఫొటోలు వగైరాలుతీసి భద్రపరుస్తారు. మనం మగవారికి అన్నిట్లోనూ వ్యతిరేకంగా వుండాలికదా! అందుకని మనం అత్తవారింటి ఫొటోలను, అంతగా అవసరమైతే పురుడోసుకున్న గది ఫొటోలను జాగ్రత్త చేయాలి. హనుమాయమ్మ అనే రచయిత్రి

తదనంతరం "హనుమాయమ్మ డైరీలు" "హనుమాయమ్మతో మాటా-మంతీ" "హనుమాయమ్మ లేఖలు" "హనుమాయమ్మ జీవిత దర్పణం" అని సంపుటాలుగా వరుసగా వెలువర్చటానికి వీలైనంత తుక్కూ-దూగరా యిప్పట్నుంచే ప్రోగుచేయాలి. ప్రతి ఆడ రైటరూ ఒకటో అరో నవలల్ను సహం వ్రాసివుంచుకోవాలి. "హనుమాయమ్మ అసంపూర్తి రచనలు" అని ఎవరైనా పోటీలుపడి వాటిని పూర్తిచేసి జనంచేత తల వాచిపోయేలా చివాట్లు తినడానికి అవకాశాన్ని మనవే కల్పించాలి.

డైరీలు, నోట్సులవలన చాలా లాభం వుంది. హనుమాయమ్మ నోరెత్తి పైకి మాట్లాడానికి వీల్లేని సంగతులు అభిప్రాయాలు నోటికొచ్చినట్లు రాసెయ్యడానికి డైరీలో వీలున్నట్లు ఇతరచోట్ల వీలుపడదుకదా! ప్రతి స్త్రీ గురించీ తోటి 'ఆడది స్త్రీ అనే అభిమానం పెట్టుకోకుండా నిప్పులాటి నిజాల్ను నోట్సులనూ వ్రాసి ఇవి హనుమాయమ్మ తదనంతర మందు పది సంవత్సరాల తర్వాత విప్పి చదువవలసినదని ఏ నేషనల్ అర్కుయివ్స్‌లోనో డిపాజిట్ చేస్తే మరీ మంచిది. "హనుమాయమ్మ" నోట్సు కోసం జనం వెర్రెత్తిపోతారు.

బయటనుంచి రాసే క్రిటిక్స్ మనం చెప్పినట్లు వినరు. అంచాత మనవే మన పెనివిట్లను పనికొచ్చే క్రిటిక్స్‌గా తీర్చి దిద్దుకోవాలి. ఉదాహరణగా "నా కథకాని నవలకాని తిరిగొచ్చినపుడు మా వారు బెల్టుతో నన్ను చితక్కొట్టిన సన్నివేశం నా కిప్పటికీ మనో నేత్రాల ముందు నాట్యమాడుతూ వుంటుంది.'' ''వారు భుజంమీద చెయ్యేసి, నా వెన్ను తట్టి, నన్నెత్తుకుని ఒళ్ళో కూర్చోపెట్టుకుని నా రచనల్ను నా చేత చదివించుకుని విని ఆనందించే ఘడియలు నా జీవితంలో మరుపురానివి. నాకు భర్తగానే కాక పోస్ట్‌మాన్‌గా జీవితాంతం గుర్తుంటారు_" "ఒక సమయంలో జిగురుబుడ్డి కనపడకపోతే వారు నాలికతో పోస్టు బిళ్ళలు అంటిస్తూంటే నా కళ్ళవెంట నీళ్ళు తిరిగేవి.'' —

"నా నవలకు ప్రయిజురాక నేను మూడ్రోజులు వంటచేయకుండా తిరిగొచ్చిన నవలను పక్కలో పెట్టుకుని కుళ్ళి కుళ్ళి శోకిస్తూంటే వారే వంటచేసి నాకు బెడ్ కాఫీ దగ్గర్నుంచీ అందిచ్చి నాకు కన్నీరింకిపోయి, ఇక నేను అశోకినైతే, నా బదులుకూడా వారే కన్నీరు మున్నీరుగా ఏడ్చిన ఘట్టం, నా కిప్పటికీ పచ్చి పచ్చిగా మనో ఫలకంమీద, సినిమా రీలులా తిరుగాడుతూనే వుంటుంది." ఇలా వుంటాయి సంగతులు.

హనుమాయమ్మ డైరీలు మీకు చదవాలనుందా ? హనుమాయమ్మ మొగుడెవరో మీకు తెలుసుకోవాలనుందా !— హనుమాయమ్మ డైరీలు రాస్తా న్రాస్తాన్. నన్ను చంపకండర్రా బాబూ !